ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సాఫీగా ఓట్ల లెక్కింపు
- పర్యవేక్షించిన రిటర్నింగ్ అధికారి, అబ్జర్వర్లు

నాగర్‌కర్నూల్, జూన్ 4: పార్లమెంట్ ఎన్నికల్లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు మధ్య ప్రక్రియ నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. పార్లమెంట్ నియోజకవర్గం లోని కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్లను నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ మంగళవారం లెక్కింపు జరిపారు. రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ నేతృత్వంలో వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవన్, గద్వాల కలెక్టర్ సంతోష్‌కుమార్, అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, సంచిత్‌గంగ్వార్, అపూర్వ చౌహాన్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షణ జరిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేష్ జైవన్నీ, సత్పాల్‌శర్మలు ఓట్ల లెక్కింపు తీరును నిశితంగా పరిశీలించారు. ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఫలితంగా ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యింది. ఉదయం 5 గంటల నుంచే కౌంటింగ్‌కోసం సన్నాహాలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో కలెక్టర్ నేతృత్వంలో కౌంటింగ్ సిబ్బంది మూడో ర్యాండమైజేషన్ నిర్వహించి, ఆజాబితా ప్రకారంగా సిబ్బందిని ఆయా టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు బాధ్యతలు కేటాయించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించిన మీదట, ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కిస్తూ రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించారు. ముందస్తుగానే టేబుళ్ల వారీగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులతోపాటు స్ట్రాంగ్ రూమ్ నుంచి వెంటనే ఈవీఎంలను కౌంటింగ్ హాల్‌కు తరలించేలా అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూచ తప్పకుండా పాటిస్తూ, వెనువెంటనే ఓట్ల లెక్కింపు జరుపుతూ ఫలితాలు వెల్లడించారు. పోస్టల్ వ్యాలెట్లతోపాటు పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తికాగా, అన్ని అంశాలను సరిచూసుకున్న మీదట రిటర్నింగ్ అధికారులు ఒక్కో రౌండ్ వారీగా 22 రౌండ్ల ఫలితాలను వెల్లడించారు. మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీ చేయగా, ఒక్కో అభ్యర్థి వారీగా పోలైన ఓట్ల వివరాలను ప్రకటించారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 17 రౌండ్లలో పూర్తి చేయగా, వనపర్తి 20రౌండ్లు, అచ్చంపేట 22 రౌండ్లు, గద్వాల 12 రౌండ్లు, అలంపూర్ 21 రౌండ్లు, కల్వకుర్తి 20 రౌండ్లు, కొల్లాపూర్ 21 రౌండ్ల వారీగా కౌంటింగ్ జరిపిన మీదట రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ తుది ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన మల్లు రవికి పరిశీలకుల సమక్షంలో కలెక్టర్ విజయ ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. కాగా రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండి, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు నిశితంగా పర్యవేక్షణ జరిపారు. కౌంటింగ్ కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల్లో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి, 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోనికి ఇతరులను అనుమతించలేదు. కౌంటింగ్ సిబ్బందితోపాటు వివిధ బాధ్యతలు నిర్వర్తించిన సిబ్బందికి ఎంట్రీ పాసులు జారీ చేసినప్పటికీ వారిని సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేసి కౌంటింగ్ విధులకు పంపించారు. సెల్‌ఫోన్లు, వీడియోలు, కెమెరాలను నిషేధించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీ ఏర్పాట్ల నడుమ అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పూర్తి పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపును పూర్తిచేసి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను విజయవంతంగా ముగించడంతో జిల్లా యంత్రాంగం సఫలీకృతమైంది.

కౌంటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు

ఎంపీగా గెలిచిన మల్లు రవికి ధృవీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

పార్లమెంట్ ఎన్నికల్లో పుంజుకొన్న బీఆర్ఎస్

కల్వకుర్తి, జూన్ 4 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గంలో గణనీయంగా పుంజుకున్నది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 42,847 ఓట్లు సాధించిన బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో 51,893 ఓట్లు సాధించి 9,046 ఓట్ల మెజార్టీతో ద్వితీయ స్థానంలో నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 70,448 ఓట్లు ద్వితీయ స్థానంలో నిలిచిన బీజేపీ పార్టీ పార్లమెం ట్ ఎన్నికల్లో 19,331 ఓట్లు కోల్పోయి 51,117 ఓట్ల తో తృతీయ స్థానంలో నిలిచింది. అధికార కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. అసెంబ్లీ ఎన్నికల్లో 75,858 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. పార్లమెంట్ ఎన్నికల్లో 63,720 ఓట్లు మాత్రమే సాధించింది. అంటే అసెంబ్లీ ఎన్నికల కంటే 12,138ఓట్లు తక్కువగా సాధించింది. బీఆర్ఎస్ ఓట్లు అనూహ్యంగా పుంజుకోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తల నుంచి సంతోషం వ్యక్తమవుతుంది.

గత అసెంబ్లీ ఎన్నికలను పోల్చి చూస్తే బీజేపీ దాదాపు 20వేల ఓట్లను, కాంగ్రెస్ 12వే ల ఓట్లను కోల్పోవడం పట్ల ఆయా పార్టీల కార్యకర్తల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతుంది.

చారకొండ : జూపల్లిలో సంబురాలు జరుపుకొంటున్న నాయకులు

మల్లురవి గెలుపుతో కాంగ్రెస్ సంబురాలు

అచ్చంపేటరూరల్/బల్మూరు/చారకొండ, జూన్ 4 : నాగర్‌కర్నూల్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి గెలుపొందగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు లచ్చునాయక్, నాగరాజు, కేఆర్ నాయక్, శ్రీరాంనాయక్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అచ్చంపేటలో స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకొన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా మల్లు రవి విజయం సాధించడంతో బల్మూర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా దేశంలో మూడో సారి మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుండడంతో బీజేపీ కార్యకర్తలు కూడా సంబురాలు జరుపుకొన్నారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి విజయం సాధించడంతో చారకొండ మండలం జూపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పటాకులు కాల్చి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, బాలేమియా, బాలస్వామి, రాములుయాదవ్, కమలొద్దీన్, బిక్కన్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో బీఆర్ఎస్‌కు 2700 మెజార్టీ

- పట్టు నిలుపుకొన్న ఉప్పల వెంకటేశ్

కల్వకుర్తి, జూన్ 4 : పార్లమెంట్ ఎన్నిక ల్లో తలకొండపల్లి మండలంలో జెడ్పీటీసీ సభ్యు డు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ తన పట్టును నిలుపుకొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి ఎన్నికల బరిలో నిల్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా తలకొండపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉప్పల వెంకటేశ్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ఫలితాలలో తలకొండపల్లి మం డలంలో బీఆర్ఎస్ పార్టీకి 2700 మెజార్టీ లభించింది. తలకొండపల్లి మండలంలో మొత్తం 28,331 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్‌కు 10,570, కాంగ్రెస్ అభ్యర్థికి 7,868, బీజేపీ అభ్యర్థికి 7,727 ఓట్లు వచ్చాయి. తలకొండపల్లి మండలంలో బీఆర్ఎస్ క్యాడర్‌ను ఒక్కతాటిపైకి తీసుకురావడంలో ఉప్పల వెంకటేశ్ ముందంజ లో ఉండడంతోనే మెజార్టీ సాధ్యమైందని బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నారు. ప్రస్తుత కల్వకుర్తి ఎమ్మెల్యేది తలకొండపల్లి మండలమే. సొంత మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పడే విధంగా ఎమ్మెల్యే స్కెచ్‌లు వేయడం సహజం, ఎందుకంటే అధికార పార్టీ ఎమ్మెల్యే గనుక అర్థబలం ఉంటుంది. అయినప్పటికీ ఓటర్లు మండలంలో బీఆర్ఎస్‌ను ఆదరించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మెజార్టీ స్థానా ల్లో సర్పంచులను, ఎంపీటీసీలను గెలిపించుకొని తన వర్గం వ్యక్తినే ఎంపీపీగా గెలిపించుకున్నాడు.

తాను స్వయంగా జెడ్పీటీసీగా గెలుపొందాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీ ఆహ్వానం మేరకు వెంకటేశ్ బీఆర్ఎస్‌లో చేరడంతో అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా నియమించింది.

డ్రైనేజీ అస్తవ్యస్తం

ఇన్నర్ వాల్వ్ నుంచి బయటికి వస్తున్న మురుగు నీరు

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

అచ్చంపేటరూరల్, జూన్ 4 : అచ్చంపేటలో తాసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో మీ సేవ సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అదేవిధంగా రోడ్డు పక్కనే పబ్లిక్ టాయిలెట్స్ కూడా ఉండడం అక్కడ మల మూత్రాలు ఇన్నర్ వాల్వ్ నుంచి బయటకు రావడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నది. దీంతో కాలనీవాసులతోపాటు ఆ దారిని పోయే వారంతా ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి తీవ్ర దుర్గంధం నుంచి విముక్తి కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గాలివాన బీభత్సం

- కూలిన చెట్లు, రైస్ మిల్లు, ఎగిరిపోయిన రైకులు

ఎగిరిపోయిన రైస్‌మిల్లు రేకులు

గద్వాల అర్బన్, జూన్ 4 : మండలంలో మంగళవారం ఉరుములతో కూడిన గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో మండలంలోని శెట్టి అత్మకుర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న రెండు వృక్షాలు విరిగి రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు కలిగాయి. దాదాపు 2గంటలపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో సమాచారం అందుకున్న గద్వాల రూరల్ ఎస్సై ఘట నా స్థలానికి చెరుకొని వృక్షాలను తొలగించి ట్రాఫిక్ సమస్యను తీర్చారు. అలా గే మండలంలోని గోనుపాడు గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న రైస్‌మిల్లు రేకులు గాలివానకు ఎగిరి ఖాళీ ప్రదేశాల్లో పడ్డాయి. రైస్‌మిల్లు కూలిపో యింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు చెబుతున్నారు. రైస్‌మిల్లు పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు.

మూల్యాంకనానికి పకడ్బందీ ఏర్పాట్లు

మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో

పాలమూరు, జూన్ 4 : ఈనెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ స్పాట్ వాల్యువేషన్ నిర్వహిస్తున్న ట్లు క్యాంప్ అధికారి, జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీధర్‌సుమన్ తెలిపారు. మంగళవారం మూల్యాంకన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఐదు జిల్లాల ప్రిన్సిపాళ్లు, జూనియర్ కళాశాలల లెక్చరర్లు ఈ మూల్యాంకనంలో పాల్గొనున్నారని తెలిపారు. మొదటి స్పెల్ 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, సంస్కృతం, తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్‌కు సంబంధించిన ఏడు సబ్జెక్టుల అధ్యాపకులు పాల్గొననున్నట్లు తెలిపారు. అదేవిధంగా జి ల్లాల వారీగా మూల్యాంకన సిబ్బంది వివరాలను తెలియజేస్తూ జోగులాంబ గద్వాల 92, వనపర్తి 181, నాగర్‌కర్నూల్ 171, మహబూబ్‌నగర్ 221, నారాయణపేట 110, మొత్తం 775మంది మొదటి స్పెల్ మూల్యాంకనం లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. నీళ్లు, ఫ్యాన్లు, డ్యుయల్ డెస్క్‌లు, వాష్ రూంలు, క్యాంటిన్ తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మూల్యాంకన సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉదయం 15 పేపర్లు, మధ్యాహ్నం 15 పేపర్లు ముదింపు చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. క్యాంప్ వేళలను కచ్చితంగా పాటించాలని, లేదంటే చర్యలు తప్పవన్నారు. సెల్‌ఫోన్లు చీఫ్ ఎగ్జామినర్ల వద్ద ఉంచాలని, మూల్యాంకన సమయంలో ఎట్టిపరిస్థితు ల్లో ఫోన్లనువద్ద ఉంచుకోరాదన్నారు. అనధికార వ్యక్తులను క్యాంప్‌లోకి అనుమతించరాదని, తప్పనిసరిగా ఐడీకార్డులను ధరించాలని సూచించారు. ఆయా జిల్లాల్లో మూ ల్యాంకన సిబ్బందిని తప్పక రిలీవ్ చేసేలా కళాశాలలకు బో ర్డు ఆదేశాలు జారీ చేసిందని, రిలీవ్ చేయని కళాశాలకు నోటీసులు జారీ చేసి పెనాల్టీలు విధిస్తామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-327729-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

బీఆర్ఎస్ నేత మృతి

వంగూరు, జూన్ 4 : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత నార్లకంటి సుధాముడు(58) అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య చంద్రమ్మ గ్రామ సర్పంచ్‌గా పని చేసిన సమయంలో భర్త సుధాముడే అన్ని తానై చూసుకునేవారు. సుధాముడి మృతితో గ్రా మంలో విషాధచాయలు అలుముకున్నాయి.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ఉండవెల్లి, జూన్ 4 : హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్తున్న కారు డ్రైవర్ అజాగ్రత్తతో డివైడర్‌ను ఢీకొనగా.. ఆరుగురికి గాయాలైన ఘట న మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు హైదరాబాద్‌కు చెందిన వినయ్, యస్మిత, దీపిక, మనోజ్, మమత, మున్నా డ్రైవర్‌తో కలిసి కారులో కర్నూలుకు వెళ్తున్నారు. ఉండవెల్లి శివారులోకి రాగానే డ్రైవర్ అజాగ్రత్తతో డివైడర్‌ను కారు ఢీకొన్నది. ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో కర్నూల్ దవాఖానకు తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ దగ్ధం

- రూ.7లక్షల ఆస్తినష్టం

చాయ్ తలాబ్‌లో వ్యాపించిన పొగలు

కొత్తకోట, జూన్ 4 : షార్ట్ సర్క్యూట్‌తో టీ స్టాల్ దగ్ధమైన ఘటన కొత్తకోట పట్టణంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బస్టాండ్ కూడలిలో ఉన్న చాయ్ తలబ్ టీస్టాల్‌లో మంగళవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులతోపాటు హోటల్ నిర్వాహకుడైన బాలుకు సమాచారమిచ్చారు. అనంతరం దుకాణం షటర్ తీయగా ఫర్నిచర్‌తోపాటు సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. చుట్టుపక్కల మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. కాగా హోటల్ దగ్ధమైన ఘటనలో సుమారు రూ.7లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు

గణితం టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్, జూన్ 4: గణితం అధ్యాపకులపై ఒత్తిడి పెరిగిందని, తమ సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు శ్రీకాంత్ మంగళవారం ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరు, ఏడు తరగతులకు సైన్స్ అధ్యాపకులతోనే గణితం సబ్జెక్టు బోధన చేయించాలన్నారు. గణితం అధ్యాపకులు పదో తరగతి వరకు బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అధ్యాపకులు కట్టుబడి ఉండాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రైతుబంధు విడుదల చేయాలి

కొల్లాపూర్, జూన్ 4: వానకాలం పంట పెట్టుబడులకు డబ్బులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేయాలని రైతుసంఘం నాయకుడు బాలపీరు డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. యాసంగి పంటలకు కూడా సకాలంలో పెట్టుబడి సహాయం అందలేదన్నారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా రైతుబంధు నిధులను విడుదల చేయాలని కోరారు. వారి వెంట సీపీఎం ప్రజాసంఘాల నాయకులున్నారు.

పప్పు దినుసు పంటలను సాగు చేయాలి

- కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి

రైతులకు విత్తనాలు అందజేస్తున్న కేవీకే కోఆర్డినేటర్

బిజినేపల్లి, జూన్ 4: రైతులు పప్పు దినుసుల పంటలను సాగు చేయడం వల్ల మంచి దిగుబడి సాధించవచ్చునని కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం గ్రామంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో పర్వతాపూర్, వసంతాపూర్, ఖానాపూర్, నల్లవెల్లి, ఎత్మతాపూర్ గ్రామాల్లో కందిసాగులో సామూహిక ప్రదర్శనా క్షేత్రాల్లో భాగంగా శిక్షణ, విత్తనం, పంట కీలక ఉత్పాదకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం జాతీయస్థాయిలో జాతీయ ఆహార భద్రత పథకం కింద అధిక మొత్తంలో పప్పు దినుసుల పంటలను పోత్సహించడం జరుగుతుందన్నారు. కందిపంట ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం రైతులకు కంది సాగు విషయాలతోపాటు నాణ్యమైన విత్తనాలు, కలుపు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రాజశేఖర్, రామకృష్ణ, రైతులు ఉన్నారు.

కల్తీ విత్తనాలు, ఎరువులు అరికట్టాలి

చారకొండ, జూన్ 4: కల్తీ విత్తనాలు, ఎ రువులు అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని తెలంగాణ రైతు హ క్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు రా ములుయాదవ్ మంగళవారం పేర్కొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పం టలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, మార్కెట్‌లోనే పంటలు కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయరంగంలో దళారుల దోపిడీని అరికట్టి, రైతులు పండించిన పం టను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని చెప్పారు. అదేవిధంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేయాలని పేర్కొన్నారు.

పాలిసెట్ ర్యాంకర్‌కు అభినందన

కొల్లాపూర్, జూన్ 4: మండలంలోని రామాపూరానికి చెందిన చంద్రయ్య కుమారుడు పాలిసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించాడు. సంతోశ్ ప్రభుత్వ పాఠశాలలో చదివి రాష్ట్రస్థాయిలో 141వ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. పేదరికం చదువుకు అడ్డుకాదని నిరూపించిన విద్యార్థికి తోడుగా ఉంటామని గ్రామస్తులు భరోసానిచ్చారు. సర్కారు బడుల్లో చదివిన విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇచ్చిన శశికాంత్ వాల్మీకికి సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

లింగాల, జూన్ 4 : మండలంలోని ధారారంలో మంగళవారం బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా శక్తిపూజారి బైండ్ల గిరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు కోటమైసమ్మకు ప్రత్యేక పూజలు చేయగా రెండో రోజు ప్రతి ఇంటి నుంచి బిందెల్లో నీటిని తీసుకువచ్చి బొడ్రాయికి, గ్రామ దేవతకు జలాభిషేకం చేసి మూడో రోజు బోనాలతో ర్యాలీ నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవితాశ్రీనివాసులు, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పెద్దలు అశోక్‌రెడ్డి, శ్రీశైలం, విజయ్, శ్రీశైలంగౌడ్, కాశన్న, తిరుపతయ్య, మంగ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెలం పట్టివేత

నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొల్లాపూర్, జూన్ 4: ఎక్సైజ్ పోలీసుల దాడుల్లో నల్లబెల్లం పట్టుకున్న ఘటన కోడేరు మండలం ఒప్పితండాలో చోటుచేసుకున్నది. ఎక్సైజ్ ఎస్సై హన్మంతు కథనం మేరకు ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తండాలో ఆకస్మిక తనిఖీలు చేసి 420 కేజీల నల్లబెల్లం, 10కేజీల పటిక, రెండులీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 200 లీటర్ల నల్లబెల్లం పానకాన్ని పారబోశారు. అనుమానితులపై ప్రాథమిక విచారణ చేపట్టినట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు.

అచ్చంపేట గోదాం ఇన్‌చార్జిగా చందా

అచ్చంపేట, జూన్ 4 : అచ్చంపేట పౌరసరఫరాల గిడ్డంగి ఇన్‌చార్జీగా ఆర్ఐ చందాను నియమించారు. నాగర్‌కర్నూల్ ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్న చందాను నాలుగు రోజుల కిందట అచ్చంపేట గోదాం ఇన్‌చార్జిగా నియమించడంతో మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అచ్చంపేట గోదాంపై రాష్ట్ర విజిలెన్స్ టాస్క్‌ఫోర్సు బృందం తనిఖీ చేపట్టగా దాదాపు 200 బస్తాల బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగినట్లు భావించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు గోదాంను సీజ్ చేశారు. దీంతో గోదాం ఇన్‌చార్జి డీటీ వెంకటేశ్‌పై చర్యలకు గాను ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చందాను ప్రస్తుతం ఇన్‌చార్జీగా నియమించారు.